క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-2, 33 కేవీ ఫీడర్ ప్రీ మాన్సూన్ పనుల్లో భాగంగా అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఆయా గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అసౌకర్యాన్ని గమనించి, తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత


కళాజాతలో పాల్గొన్న ప్రాజెక్టు ప్రతినిధులు

పరవాడ: ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లో యాక్సెస్ మై గ్రాంట్స్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాజాత బృందం సభ్యులు పాటలు, నాటకాలు, స్కిట్ల ద్వారా అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందం సభ్యులు హాస్యం, పాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ అనిల్‌కుమార్, భాస్కర్, లత, మోహన్, కోదండ, ప్రసాద్, కుమారి పాల్గొన్నారు.

ఆటలు ఆడేద్దాం రండి..


మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆటలు ఆడించారు. మ్యూజికల్ చైర్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్‌లో మెళకువలు నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా


పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

పెదగంట్యాడ: మండలంలో ఎక్కడికక్కడే తాగునీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్లు పగిలిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అసలే వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం జనం ఇబ్బందులు పడుతుంటే ఈ లీకుల వల్ల మరిన్ని ఇబ్బందులు నెలకొంటున్నాయి. మండలంలోని పెదగంట్యాడ జంక్షన్ ఫైర్‌స్టేషన్ వద్ద రోడ్డు మధ్యలో పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. అలాగే అక్కడికి సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కూడా పైప్‌లైన్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. ప్రధాన రహదారిలో తాగునీరు ఇలా వృథా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి చర్యలు చేపట్టి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

దివ్యాంగ పిల్లల వివరాలపై ఆరా


సర్వేపై ఆరా తీస్తున్న జిల్లా సహిత విద్య సమన్వయకర్త గీత

కూర్మన్నపాలెం: దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వేను జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గీత గురువారం పరిశీలించారు. గాజువాక మండలంలో గత వారంలో నిర్వహించిన సర్వే ద్వారా 15 మంది పిల్లలను అధికారులు గుర్తించారు. వారి వివరాలను సమన్వయకర్త గీత అడిగి తెలుసుకున్నారు. పిల్లలు, వారి తల్లిదండ్రులకు అర్బిజన్‌పై అవగాహన కల్పించారు. తాము గుర్తించిన పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం నానాటికీ పెరుగుతోంది. పండిన పంటలకు గిట్టుబాటు ధర దక్కట్లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వారికి దన్నుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలవాలి. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం, రాయితీపై ఎరువులు, విత్తనాలు అందించడం, మద్దతు ధర కల్పించడం వంటి వాటి ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రయత్నించాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవేవీ రైతులకు అంత ఆషామాషీగా దక్కేలా కనిపించట్లేదు.

అన్నదాత.. కష్టేభవ!

- రైతుకు పెట్టుబడి సాయంపై మీనమేషాలు
- మండలంలో కొనసాగుతున్న రైతుల పరిశీలన
- తరుచూ మొరాయిస్తున్న సర్వర్
- గడువు 25.. ఇప్పటి వరకు పరిశీలన 25 శాతం
- ఖరీఫ్ సమీపిస్తున్నా పెట్టుబడి సాయం సందేహమే!


ఆదిరెడ్డిపాలెం రైతు సేవా కేంద్రంలో వెబ్‌ల్యాండ్‌లో వివరాలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సబ్బవరం: కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి ప్రోత్సాహం కరవయింది. ఎన్నికల హామీల్లో ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం హామీ ఇంకా అమల్లోకి రాలేదు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. దీంతో అన్నదాత సుఖీభవ ద్వారా అర్హులైన రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయంపై ప్రభుత్వంలో కదలిక మొదలైంది. ప్రభుత్వ, వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు మండలంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)/ప్రస్తుత రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది రైతుల ఖాతాల పరిశీలన చేపట్టారు. దీనిపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో పరిశీలన మందకొడిగా సాగుతోంది.

కొనసాగుతున్న ఖాతాల పరిశీలన

వాస్తవంగా సోమవారంతో గడువు ముగియాల్సి ఉండగా, తరచూ సర్వర్ మొరాయించడంతో అప్పటికి 20 శాతం పని మాత్రమే అయింది. దీంతో గడువును ఈ నెల 25 వరకూ పొడిగించారు.

ప్రస్తుతం మండలంలో రైతుల వెబ్‌ల్యాండ్ పరిశీలన 25 శాతం వరకు పూర్తయింది. అన్నదాత సుఖీభవపై ప్రాథమిక స్థాయి పరిశీలనలో భాగంగా గత ప్రభుత్వంలోని అర్హుల జాబితాను పరిశీలిస్తున్నారు. ఈ జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకూ అన్నదాత సుఖీభవ పథకం విధి విధానాలను విడుదల చేయకపోవడం, కొత్తగా రైతుల నమోదుకు అవకాశం కల్పించకపోవడంతో లబ్ధిదారుల్లో కోత విధిస్తారేమోనన్న ఆందోళన నెలకొంది.

అప్పట్లో వలంటీర్ల ద్వారానే నమోదు

గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామంలోని వలంటీర్లతో సమన్వయం చేసుకుని రైతుల వివరాలు సేకరించి నమోదు చేసేవాళ్లు. ప్రస్తుతం అటువంటి వెసులుబాటు ఏమీ లేకపోవడంతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. సర్వర్ తరచూ మొరాయించడం.. సిబ్బందికి ఖాళీ లేకపోవడంతో రోజూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అన్నదాతకు అండగా జగన్ ప్రభుత్వం

గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతుల చెంతకే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంది. సచివాలయ పరిధిలో ఆర్బీకేల ఏర్పాటు, రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాల పంపిణీ, ఉచిత పంటల బీమా అందించింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా సచివాలయం కేంద్రంగా రైతు సేవా యూనిట్లలో వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందుబాటులోకి తెచ్చింది. రైతులకు సత్వర సేవలందించేందుకు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ సహాయకులను నియమించింది. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు, రైతుల చెంతకే వెళ్లి వారు పండించిన పంటలను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసి, అన్నివేళలా అన్నదాతకు అండగా నిలిచింది.


గత ప్రభుత్వంలో గ్రామంలోని రైతుల వద్దకు వెళ్లి పంటల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

మండలంలో వివరాలు

- గ్రామ పంచాయితీలు 24
- మొత్తం వ్యవసాయ భూమి 22 వేల ఎకరాలు
- మొత్తం రైతు ఖాతాలు 21,357
- గత ప్రభుత్వంలో రైతు భరోసా లబ్ధిదారులు 9,530 మంది
- ఏడాదికి ఒక్కో రైతుకు అందిన సాయం రూ.13,500
- మండలంలో ఏడాదికి అందించిన లబ్ధి రూ.12.86 కోట్లు


గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై ఎరువులు అందుకున్న రైతులు

చురుగ్గా పరిశీలన



అన్నదాత సుఖీభవ కోసం అర్హులను గుర్తించేందుకు రైతుల పరిశీలన చురుగ్గా సాగుతోంది. పరిశీలన గడువు ఈ నెల 25కు పెంచాం. కొత్తవారి వివరాలు నమోదు చేయడంతో పాటు, అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం విధి విధానాలు ప్రకటించాల్సి ఉంది. గత ప్రభుత్వంలో 9,530 మందికి రైతు భరోసా అందించారు. కుటుంబాల వర్గీకరణ జరగడంతో అర్హుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి, సబ్బవరం మండలం

జిలానీ కుటుంబానికి అండగా ఉంటాం


జిలానీ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిలానీ మరణం పార్టీకి తీవ్ర లోటని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా తాను, పార్టీ ఎల్లప్పుడూ జిలానీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన జిలానీ కుటుంబాన్ని అదీప్‌రాజ్ గురువారం పరామర్శించారు. నాయుడుతోటలోని జిలానీ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు బల్ల రాంబాబు, దాసరి సత్తిబాబు, కనకరాజు పాల్గొన్నారు.

పుస్తకం చదివి.. కథలు చెప్పి..


బుక్ రీడింగ్‌లో విద్యార్థులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్స్ కె.ఎస్.ఆర్.మూర్తి, సీహెచ్ఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో చిట్కాలు నేర్పించారు. చిన్న చిన్న కథల ద్వారా ఎంతో నీతి ఉంటుందని సోదాహరణంగా వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండేటా పెద్దలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. తడి-పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అన్యాయంగా రోడ్డున పడేశారు



అదీప్‌రాజ్‌తో సబ్బవరం మండల ఎండీయూ వాహనాల సిబ్బంది

పెందుర్తి: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా ప్రవేశపెట్టి, విజయవంతంగా అమలు చేసిన ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూ వాహనాల ద్వారా జీవనం సాగిస్తున్న సిబ్బందిని ప్రభుత్వం రోడ్డు పాలు చేసిందని మండిపడ్డారు. ఎండీయూ వాహనాల తొలగింపు నేపథ్యంలో సబ్బవరం మండలంలోని ఎండీయూ సిబ్బంది అదీప్‌రాజ్‌ను కలిసి తమ ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ వారికి భరోసా ఇస్తూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని చెప్పారు. సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎండీయూ సిబ్బంది వడిశెల దుర్గాప్రసాద్, గొర్లె రాజేష్, కోరుకొండ శివ, అల్లం కోటినాయుడు, గురి రమేష్, కర్రి శ్రీనివాస్, సేనాపతి సంతోష్‌కుమార్, పైలా ఈశ్వరరావు, సర్వసిద్ధి రాము, సబ్బవరపు తాతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల సత్వర పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రం సబ్బవరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పాల్గొని, ప్రజల నుంచి పలు సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఆయా పరిధిలోని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. పరిధి దాటిన సమస్యలను సీఎం పేషీ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వచ్చే నెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, సీఐ జి.రామచంద్రరావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతుగా నిరసన



నిరసన తెలుపుతున్న సిటు నేతలు, కార్మికులు

పరవాడ: విశాఖ ఉక్కులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెనక్కి తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంటు కార్మికుల సమ్మెకు మద్దతుగా ఫార్మాసిటీ సింహాద్రి కూడలిలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్రం ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. స్టీల్ ప్లాంటు అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేసిన కార్మికులను, తొలగించడం ఆక్షేపణీయమన్నారు. ఇటువంటి విధానాలను మానుకుని స్టీల్ ప్లాంట్ పరిరక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగప్పారావు, రాము, అప్పారావు, రమణ, అప్పలనాయుడు, తాతబాబు పాల్గొన్నారు.

శ్రీరామదూతం.. శిరసా నమామి

- ఊరూవాడా ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవాలు
- పోటెత్తిన భక్తులు.. భారీ అన్నసమారాధనలు


సింహగిరి మెట్లమార్గంలో కొలువైన ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


ఎంపీపీ బోకం సూర్యకుమారితో కలిసి అన్న వద్దన చేస్తున్న చొక్కాకుల వెంకటరావు

పెందుర్తి: శ్రీరామ బంటు హనుమాన్ జయంతి వేడుకలు నియోజకవర్గంలో ఊరూవాడా గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ సమూహంలోని సంకట మోచన అభయాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం స్వామికి నవ ద్రవ్యాలతో అభిషేకాలు, అనంతరం విశేష అలంకరణ చేసి, దర్శనాలు జరిగాయి.

- చినముషిడివాడ పాతూరులోని విఘ్నేశ్వర, సూర్యనారాయణ సమేత సీతారామాలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.
- లక్ష్మీపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, స్థానిక పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.
- పినగాడి వెల్ఫేర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం దాదాపు వెయ్యి మందికి అన్నప్రసాదం వడ్డించారు. వైఎస్సార్‌సీపీ నేత బయిలపూడి భగవాన్ జయరాం, సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి ఉన్నారు.
- పురుషోత్తపురం అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో 4 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు స్వామిని దర్శించుకున్నారు.
- చినముషిడివాడ శారదాపీఠంలో గత 13 రోజులుగా జరుగుతున్న వజ్రిని స్కంద పాశుపత హనుమద్ మహాయాగం ముగిసింది. పీఠంలోని దాసాంజనేయస్వామికి స్వామీజీలు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా విశేష అభిషేకాలు, పూజలు జరిపారు.
- పెందుర్తి, సుజాతనగర్, వేపగుంట, నాయుడుతోట, గొరపల్లి, రాంపురం, పెదగాడి, పినగాడి, గవరపాలెం, ఎస్ఆర్ పురం, సరిపల్లి ప్రాంతాల్లో హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.


చినముషిడివాడ పాతూరు హనుమాన్ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో ఉన్న పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీరామ పట్టాభిషేక సర్గ పారాయణం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో హోమం నిర్వహించారు.

- సింహగిరి ఘాట్‌రోడ్డులో కొలువైన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు స్వామికి సిందూరపూజ చేశారు.
- కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దనున్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, పూజలు ఘనంగా నిర్వహించారు.
- 98, 93వ వార్డులలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి పూజలు ఘనంగా జరిపారు.

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం మారుతీ కూడలిలోని వీరాంజనేయ స్వామిని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అన్నసమారాధనలో పాల్గొన్నారు. సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు యర్రంశెట్టి రాము, చిత్రాడ శ్రీను, ఆలయ ధర్మకర్త కొటాన బుజ్జి పాల్గొన్నారు.

- రావలమ్మపాలెం వీరాంజనేయస్వామి సన్నిధిలో పారిశ్రామికవేత్త చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు, గ్రామ పెద్దలతో కలిసి అన్నసమారాధన జరిపారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, ఎంపీటీసీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు, పీఏసీఎస్ కార్యదర్శి గొంప రమణ స్వామిని దర్శించుకున్నారు.
- మొగలిపురం శివారు వీరాంజనేయస్వామి, సబ్బవరం మారుతీ జంక్షన్‌లోని వీరాంజనేయస్వామివార్లను పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన వెంట సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పీపీసీఎస్ వైస్ చైర్మన్ పల్ల కృష్ణ, యడ్ల నాయుడు, ఐడి బాబు, సిరపరపు వాసు, కరక రాము ఉన్నారు.

పరవాడ: స్థానిక సిని మాహాలు కూడలిలో కొలువుదీరిన అభయాంజనేయస్వామిని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు కనకారావు, రాధాకృష్ణ, అప్పలనాయుడు, అయ్యబాబు, సత్తిబాబు, శ్రీను, రెడ్డి నగేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- పెదముషిడివాడలో కొలువైన ఆంజనేయస్వామిని సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు.


శారదాపీఠంలో స్వామీజీల సమక్షంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు


లక్ష్మీపురంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల


పురుషోత్తపురంలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న ముమ్మన దేముడు


మొగలిపురంలో వీరాంజనేయస్వామి సన్నిధిలో గండి రవికుమార్ తదితరులు


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు